ప్రచురణార్హమైన

భారతదేశ సర్వోన్నత న్యాయస్థానము

సివిల్ అప్పీల్లేట్ జూరిస్డిక్షన్

సివిల్ అప్పీల్ నెం.2012/2013

శ్రీ రాకేష్ రామన్ ---అప్పీలుదారు

వర్సెస్

ఎస్ఎంటీ. కవిత ---ప్రతివాది

# తీర్పు

గౌరవ న్యాయమూర్తి సుధాన్షు ధులియా

1. ఢిల్లీలోని తిస్ హజారీ కోర్టుల్లోని అదనపు జిల్లా న్యాయమూర్తి (ఉత్తర) న్యాయస్థానంలో హిందూ వివాహ చట్టము, 1955 (ఇకపై ఇది "చట్టము" అని పిలువబడుతుంది)లోని సెక్షన్ 13 కింద అప్పీలుదారు ప్రారంభించిన విడాకుల విచారణ నుండి ఈ అప్పీల్ ఉత్పన్నమైనది మరియు అదనపు జిల్లా న్యాయమూర్తి(ఉత్తర) తేది.02.05.2009న ఇచ్చిన ఉత్తర్వు ద్వారా ఆతని వ్యాజ్యము ఆమోదింపబడి, అతని వివాహం రద్దు చేయబడింది. దాని మీదట ప్రతివాది/భార్య, ఢిల్లీ హైకోర్టులో అప్పీల్ దాఖలు చేయగా, ఇది (హైకోర్టు) విచారణ కోర్టు ఉత్తర్వులను త్రోసిపుచ్చి, భర్త వేసిన దరఖాస్తును కొట్టివేసింది . ఈ ఉత్తర్వు వల్ల వ్యధితుడు అయిన అప్పీలుదారుడు/భర్త ఈ న్యాయస్థానంలో స్పెషల్ లీవ్ పిటిషన్ ను దాఖలు చేశారు, దానిపై తేది. 26.02.2013న అనుమతి మంజూరు చేయబడింది.

2. అప్పీలుదారుడు మరియు ప్రతివాదిల వివాహం తేది.16.04.1994న హిందూ ఆచారాలు మరియు సాంప్రదాయాల ప్రకారం ఢిల్లీలో జరిగినది. దురదృష్టవశాత్తు, వారి వైవాహిక జీవితంలో వివాహ సంబంధమైన విభేదాలు ఏర్పడటానికి ఎక్కువ సమయం పట్టలేదు. అప్పీలుదారుడి కేసు ఏమిటంటే, అతని భార్య వారి చిన్న నివాసగృహంలో సంతోషంగా లేరని, అతనిపై అభ్యంతరకరమైన, దుర్భాషలను కూడా ఉపయోగించినారని, 1994 సెప్టెంబరులో ఆమె తన భర్తకు ఎటువంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండానే గర్భస్రావం చేయించుకున్నారని కూడా

ఆరోపణలు ఉన్నాయి (ఈ ఆరోపణను భార్య ఖండించినారు మరియు ఆమెపై (ఇది) ఎన్నడూ నిరూపించబడలేదు). 1994వ సంవత్సరము సెప్టెంబరు మాసములో, ఆమె మళ్ళీ తన వైవాహిక గృహన్ని విడిచి వెళ్లినారు. కానీ శ్రేయోభిలాషులు మరియు బంధువుల ప్రయత్నాల కారణంగా, వారు మార్చి 1995 నుండి కలిసి జీవించడం ప్రారంభించారు. ఇది మళ్ళీ ఎక్కువ కాలం కొనసాగలేదు. ఎందుకంటే తేది16.02.1998న ఆమె తన వైవాహిక గృహాన్ని విడిచిపెట్టి, తేది.16/17.02.1998న స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినారు. మార్చి 1998లో అప్పీలుదారు మరొక గృహ వసతిని ఏర్పర్చుకోవాలనే షరతుపై అతనితో కలిసి ఉండడానికి ఆమె అంగీకరించింది. తత్ఫలితంగా 1998 ఏప్రిల్ లో మరొక ఇంటిని అద్దెకు తీసుకుని, వారిద్దరు ఆ కొత్త ఇంట్లో కలిసి నివసించడం ప్రారంభించారు. కానీ తేది.24.08.1998న, అప్పీలుదారు తన భార్య మరియు ఆమె సోదరుడు తనను కొట్టారని ఆరోపించారు. తేది. 29.11.1998 న, అతనిని రాత్రంతా తన ఇంటి నుండి దూరంగా ఉంచారు. తేది.17.12.1998న ఆమె తమ వైవాహిక గృహాన్ని వదిలి వెళ్ళి అప్పీల్ దారుడు మరియు అతని సోదరునిపై ఇండియన్ పీనల్ కోడ్( భారత శిక్షాస్మృతిలోని) 498ఎ/406 సెక్షన్ల క్రింద న్యూఢిల్లీలోని ఆనంద్ పర్బత్ పోలీస్ స్టేషన్లో FIR నమోదు చేసినారు. ఆదేరోజు అప్పీల్ దారుడు మరియు అతని సోదరుడు ఒక వివాహ వేడుకలో ఉండగా వారు అరెస్టు చేయబడినారు. ఇది అతని యొక్క 15 నుండి 20 మంది స్నేహితుల సమక్షంలో జరిగినది. తరువాత వారిద్దరు జామీనుపై విడుదల చేయబడినారు. కానీ భార్య ఈ విషయంలో చాలా పట్టుదలతో ఉండి, వారి జామీను రద్దు కోసం కూడా దరఖాస్తును దాఖలు చేసినారు. తరువాత ఆమె అప్పీలుదారుడు/భర్త మరియు అతని కుటుంబ సభ్యులపై ఐపిసిలోని సెక్షన్ 34తో కూడిన 323, 324 సెక్షన్ల కింద ఫిర్యాదు చేయడం జరిగినది కానీ, తరువాత వారు ఆ నిందల నుండి విడుదల చేయబడినారు . ప్రతివాది అప్పీలుదారునిపై క్రిమినల్ ప్రొసీజర్ కోడ్(CrPC) లోని 107 మరియు 150 సెక్షన్ల కింద కూడా చర్యలు ప్రారంభించారు. ఇంకా ఆమె హిందూ దత్తత మరియు పోషణముల చట్టము ,1956 ( Hindu Adoption and Maintenance Act 1956) లోని 18వ సెక్షన్ కింద తన నిర్వహణ వ్యయం కోసం దరఖాస్తు దాఖలు చేసినారు.

**3.** భార్య తనను వదిలి వెళ్ళడం వలన మరియు అనేక వ్యాజ్యాల భారం వలన విసుగు చెందిన , అప్పీలుదారుడు తన వైవాహిక సంబంధాలను ముగింపు పలకాలని నిర్ణయం తీసుకున్నారు. దాని మీదట అతడు హిందూ వివాహ చట్టము, 1955లోని సెక్షన్ 13 (1) (ఐఎ) మరియు (ఐబి) కింద వివాహాన్ని రద్దు చేయాలని ఉత్తర ఢిల్లీలోని అదనపు జిల్లా న్యాయమూర్తి ముందు

తేది.20.09.2002న ఇతర విషయాలతోపాటు పైన చెప్పిన విషయాలను ఉటంకిస్తూ దరఖాస్తును చేసుకున్నారు.

**4.** ప్రతివాది తాను తన భర్తను వదిలేశానని అనడాన్ని మరియు అతని యెడల క్రూరంగా ప్రవర్తించారని అనడాన్ని ఖండించారు. ఆమె తరపున న్యాయవాది తనకు ఉన్న చట్టపరమైన మార్గాలను మాత్రమే ఆమె ఆశ్రయించినారని వాదించినారు . ఇంకా ఆమె తనకు 'స్త్రీ ధనము ' గా ఇచ్చిన ఆభరణాలను తీసుకుని తిరిగి ఇవ్వలేదని , అందువలన ఆమె భారతీయ శిక్షాస్మృతి (ఐపిసి) లోని 498ఎ మరియు 406 సెక్షన్ల కింద తన భర్తపై కేసు నమోదు చేయవలసి వచ్చినదని ఆరోపించారు. ఇంకా సయోధ్య కోసం ఆమె సాధ్యమైనంత వరకు ప్రయత్నం చేశారు కానీ అప్పీలుదారుడు సహకరించకపోవడం వల్ల మధ్యవర్తిత్వం కోసం మరియు సామరస్య పరిస్కారం కోసం చేసిన ప్రయత్నాలన్నీ కూడా విఫలమయ్యాయని ఆమె తెలిపినారు , ఇంకా తాను గర్భస్రావం చేయించుకున్నాన్న ఆరోపణను ఆమె ఖండించారు.

**5.** తేది.15.10.2003న క్రూరత్వం మరియు వదిలివేయడం అనే అంశాలను కుటుంబ న్యాయస్థానం గుర్తించినది , ఈ విచారణ కోర్టు క్రూరత్వం మరియు విడిచి వేయడం పై భర్తకు అనుకూలముగా తీర్పులను ఇచ్చి మరియు వివాహన్ని రద్దు చేస్తూ ఉత్తర్వులను జారీచేసింది.

**6.** కేవలం తేది.29.11.1998న ప్రతివాది తన భర్తను ఇంటిలోనికి రానియలేదన్న వాస్తవము ఆమె శాశ్వతముగా దాంపత్య జీవితానికి ముగింపు పలకాలన్న ఉద్దేశంతో ఉన్నదనడాన్ని రుజువు చేయదనియు మరియు దీని ఆధారంగా విడిచిపెట్టెయ్యడం జరగడం వలన వివాహాన్ని రద్దు చేయడానికి ఆధారం ఉన్నదనడం సరికాదని అప్పీల్ లో హైకోర్టు అభిప్రాయపడినది. భార్య తనకు చట్టపరంగా ఉన్న పలు మార్గాలను ఆశ్రయించడం మాత్రమే చేయడం వలన కేవలం ఆమె IPC లోని 323, 324 మరియు 498ఎ సెక్షన్ల కింద వివిధ పలు ఫిర్యాదులు చేయడం , వారు ఇందులో నిర్ధోషులుగా ప్రకటింపబడడం అంతా కూడా క్రూరత్వం క్రింది పరిగణించలేమనియు మరియు ఏ పరిస్థితుల్లో ఫిర్యాదులను చేయవలసి వచ్చిందో కూడా చూడవలసి ఉంటుందనియు హైకోర్టు అభిప్రాయపడినది.

**7.** అప్పీలుదారు/భర్త తరపున గౌరవ సీనియర్ న్యాయవాది శ్రీ ఎస్. కె. రుంగ్టా మరియు ప్రతివాది/భార్య తరపున గౌరవ సీనియర్ న్యాయవాది శ్రీ ఎస్. కె. భల్లా వినిపించిన సుదీర్ఘమైన వాదనలను మేము వినడము రికార్డుల్లోని విషయాలను పరిశీలించడము జరిగినది.

**8.** తేది.08.04.2011నాటి ఢిల్లీ హైకోర్టు యొక్క తీర్పు పన్నెండు సంవత్సరముల వెనుకటిది. మా ముందు ఉన్న అన్ని వాస్తవాలను మేము ప్రస్తుతము పరిశీలనలోకి తీసుకో నవలసి ఉన్నది. మా దృష్టిలో, ఈ క్రింది విషయములను గమనించవల్సివున్నది :

(i) "ఈ జంట" ఇప్పటికీ దాదాపు 25 సంవత్సరాలుగా విడివిడిగా జీవిసిస్తున్నారు మరియు ఇన్ని సంవత్సరాలుగా వీరి మధ్య సహజీవనము లేదు.

(ii) వీరి వివాహ ము ద్వారా వీరికి ఏ సంతానము లేదు మరియు అంతా కలిసి కేవలం 4 సంవత్సరాలు మాత్రమే వీరు భార్యాభర్తలుగా కలిసి జీవించారు.

(iii) వీరి సయోధ్య కోసం లేదా రాజీయుత పరిష్కారం కోసం కోర్టులు పదేపదే చేసిన ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి.

**9.** (కేసు)ప్రారంభ దశలో విచారణ కోర్టు కక్షిదారులను మధ్యవర్తిత్వము కోసం పంపడం మరియు అది విఫలమవ్వడం జరిగినది. మళ్ళీ ఈ కేసును సామరస్యపూర్వక పరిష్కారం కోసం లోక్ అదాలత్ కు పంపడం జరిగినది కానీ ఏమి ఫలితం రాలేదు. తేది 11.04.2015న మళ్ళీ ఈ కోర్టు కక్షిదారులను వారు కలిసి జీవించడానికి ఏదైనా అవకాశాల గురించి అన్వేషించమని అడగడం జరిగినది, కానీ అది ఫలించలేదు. తేది 09.05.2015న ఈ కోర్టు కక్షిదారులను ఏదైనా సామరస్యపూర్వక పరిష్కారానికి రావాలని కోరింది, కానీ అది కూడా జరగలేదు. ఇంకా చెప్పాలంటే, కోర్టు మళ్ళీ మళ్ళీ మధ్యవర్తిత్వం , రాజీ లేదా సామరస్యపూర్వక పరిష్కారాల కోసం చేసిన ప్రయత్నాలన్నీ విఫలమైనాయి అని చెప్పాలి. ఇప్పుడు వాదనలు వినబోయే ముందు కూడా ప్రస్తుతం ఉన్న పరిస్థితుల గురించి కక్షిదారుల నుండి తెలుసుకోవడానికి ప్రయత్నించాము. అప్పీలుదారుడు రాజీయుత పరిష్కారానికి ఏ విధమైన చోటు కూడా లేదని నిష్కర్షగా చెప్పి , ఈ కేసును దాని యోగ్యతలపై నిర్ణయంచాలని కోరినారు. కానీ ప్రతివాది యొక్క న్యాయవాది ప్రతివాదికి తన వివాహాన్ని రక్షించుకోవాలని ఉన్నదని ఆమె మరొకసారి మధ్యవర్తిత్వం కోసం ప్రార్థిస్తున్నారని తెలిపినారు. అతను (ప్రతివాది యొక్క న్యాయవాది) ఇంకా విడాకులు ఇవ్వడానికి ఏ విధమైన ఆధారం లేదని, ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన నిర్ణయము పరిశీలనాత్మకమైనది కనుక దానిని ఆమోదించాలని కూడా తెలిపినారు.

**10.** మా ముందు ఉన్న భార్యాభర్తలు 25 సంవత్సరాలుగా విడిగా జీవిస్తున్నారు. వివాహం ద్వారా వీరికి సంతానం కలుగలేదు . వీరిద్దరి నుండి కూడా క్రూరత్వం గురించిన కటువైన ఆరోపణలు మరియు వదిలివేయడము అనే ఆరోపణ కూడా ఉన్నాయి, మరియు వీరి మధ్య గత 25

సంవత్సరాలుగా పలు వ్యాజ్యాలు ఉన్నాయి. ఈ విధంగా వీరి మధ్య చేదెక్కిన బాంధవ్యము వలన గత 25 సంవత్సరాలుగా అప్పీలుదారుడు మరియు ప్రతివాది శాంతి లేని క్షణాలను గడుపుతున్నారు మరియు వీరి మధ్య వైవాహిక సంబంధం నామకః మాత్రమే మీదనే ఉన్నది . ఈ సంబంధము చాలా కాలం క్రితమే కోలుకోలేని విధంగా విచ్ఛిన్నమైన మాట వాస్తవము.

**11.** కేవలం అప్పీలుదారుడు/భర్తకు వ్యతిరేకంగా క్రిమినల్ కేసులను దాఖలు చేయడమే క్రూరత్వంగా పరిగణింపబడదని హైకోర్టు అభిప్రాయపడినది. కానీ , ప్రతివాది/భార్య, అప్పీలుదారుడు/ భర్తపై దాఖలు చేసిన క్రిమినల్ కేసుల సంఖ్య గణనీయమని పై చర్చల ద్వారా తెలుస్తున్నది. ఈ కేసులన్నీ కూడా ఆరోపణలు నిలువనివిగాను లేక అప్పీలుదారుడు/ భర్త నిర్దోషిగా నిరూపించబడటంతోనూ ముగిసినది. డిల్లీ హైకోర్టు జడ్జిమెంట్ ముందు , కాకపోతే ఖచ్చితంగా ఆ జడ్జిమెంట్ తరువాత ఇవి ముగిసినవి. అదేకాక , వివాహ సంబంధమైన విషయంలో ఒక కక్షి దారుడు మరొకరిపై పదేపదే క్రిమినల్ కేసులను దాఖలు చేయడమనేది క్రూరత్వం అవుతుందని **నవీన్ కోహ్లి వర్సెస్ నీలు కోహ్లి** [(2006) 4 SCC 558]కేసులో ఈ కోర్టు యొక్క ముగ్గురు న్యాయమూర్తుల ధర్మాసనం అభిప్రాయపడినది మరియు ఇదే అభిప్రాయాన్ని **కె. శ్రీనివాస్ రావు వర్సెస్ డి.ఎ. దీప [(2013) 5 SCC 226]** కేసులో ఈ కోర్టు యొక్క డివిజన్ బెంచ్ పునరుద్ఘాటించినది.

**12**. మనం గమనించాల్సిన మరోక అంశం ఏమిటంటే, గత 25 సంవత్సరాలుగా అప్పీలుదారుడు మరియు ప్రతివాది విడివిడిగా జీవించడం వలన దాంపత్య జీవితం గడపలేదు, ఈ కక్షిదారుల మధ్య సయోధ్యకు ఖచ్చితముగా అవకాశం లేదు. వాస్తవానికి వీరి మధ్య ఎటువంటి బంధం లేకపోవడం వలన మరియు లా కమిషన్ తన 71వ నివేదికలో ఇలాంటి వివాహాల గురించి చెప్పినట్లుగా, ఈ వివాహము నిజానికి విచ్ఛిన్నమై కేవలం చట్టపరమైన గుర్తింపు మాత్రమే అవసరమైనదిగా ఉన్నది . దీనినే లా కమిషన్ తన 217వ నివేదికలో పునరుద్ఘాటించడం జరిగినది.

**13.** చాలా కాలం నుంచి విడివిడిగా జీవిస్తూ ఉండి వారు తిరిగి కలసి జీవించడానికి ఖచ్చితంగా ఏ అవకాశం లేనప్పుడు అది సరి చేయలేనట్టి వివాహం అవుతుందని **ఆర్. శ్రీనివాస్ కుమార్ వర్సెస్ ఆర్. షహమితా [(2019) 9 SCC 409], మునీష్ కక్కర్ వర్సెస్ నిధి కక్కర్[(2020) 14 SCC 657] మరియు నేహా త్యాగి వర్సెస్ లెఫ్టినెంట్ కల్నల్ దీపక్ త్యాగి [(2022) 3SCC86]** కేసులలో ఈ కోర్టు అభిప్రాయపడినది. పైన చెప్పిన అన్ని కేసులలోనూ వివాహము కోలుకోలేని విధంగా విచ్ఛిన్నం అయినదన్న విషయం ప్రాతిపదికన , ఇలాంటి ప్రాతిపదిక హిందూ వివాహ చట్టంలో

లేనప్పటికీ, భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 142 ఇస్తున్న అధికారాలను వినియోగించుకుని, ఈ కోర్టు వివాహాలను రద్దు చేయడం జరిగినది.

14. **(పైన పేర్కొన్న) నవీన్ కోహ్లి కేసులో**, హిందూ వివాహ చట్టములో విడాకులకు, వివాహము కోలుకోలేని విధంగా విచ్ఛిన్నం అవ్వడం కూడా ఒక ప్రతిపదికగా చేర్చడం గురించి పరిశీలించమని భారత ప్రభుత్వానికి, బలముగా ఈ కోర్టు, సిఫారసు చేయడం జరిగినది.

**15.** ఈ జంట మధ్య ఏ బంధము లేదన్న వాస్తవాన్ని చెప్పడానికి మరియు వీరి వివాహము నిజానికి కోలుకోలేని విధంగా విచ్ఛిన్నం అయినది అనడానికి వీరి మధ్య జరిగిన అనేక న్యాయ పోరాటాలు, మధ్యవర్తిత్వం మరియు సామరస్యపూర్వక పరిష్కారానికి చేసిన ప్రయత్నాలు పదేపదే విఫలమవ్వడమే సాక్ష్యము.

**16.** వివాహ సంబంధమైన కేసులను , మిగిలిన వానికంటే ప్రత్యేకమైనవిగా గమనించవల్సిన అవసరం ఉంది, ఎందుకంటే దీనిలో భావోద్వేగాల మూటలతో కూడిన మానవ సంబంధాల యొక్క తప్పులు మరియు ధౌర్బల్యాలతో మనము వ్యవహరించవలసి ఉంటుంది. ఒకే విధమైన సంఘటనను ప్రతి కేసులోను జీవిత భాగస్వామి యొక్క "క్రూరత్వం" లేదా నిందించగల ప్రవర్తనగా అనడానికి వీలుకాదు. కక్షిదారుల మధ్యగల బాంధవ్యము వారు ఒకరితో ఒకరు మామూలుగా ప్రవర్తించే విధానము లేక వారు చాలా కాలము నుండి విడిపోయి ఉండడము వీటన్నింటినీ సంగతమైన అంశాలుగా కోర్టు పరిగణించాల్సి ఉంటుంది. ఈ చట్టంలోని 13(1)(ఐఎ) కింద క్రూరత్వం అనేదాన్ని ఏది సంవిధానం చేస్తున్నదన్న విషయం గురించి **సమర్ ఘోష్ వర్సెస్ జయ ఘోష్ (2007)4 SCC 511** కేసులో ఈ కోర్టు యొక్క ముగ్గురు న్యాయమూర్తుల ధర్మాసనం విశదముగా చర్చించినది. ఈ కేసులో క్రూరత్వం అనే దానిని నిర్దేశించడంలో కోర్టు ఉపగమించడంలో ఒక ముఖ్యమైన మార్గదర్శకత్వాన్ని పైన చెప్పిన కేసులో ఈ కోర్టు నిర్దేశించడమైనది. క్రూరత్వం అనేది కేవలం హింసాత్మక ప్రవర్తన లేక ప్రవర్తనలు మాత్రమే కాక బాధ కల్గించే మందలింపులు, ఫిర్యాదులు, నిందారోపణలు మరియు ఎగతాళి చేయడము మొదలైన వాటి నుంచి కూడా, కేసును బట్టి, గ్రహించవల్సి ఉండడం వలన మొత్తం వైవాహిక బాంధవ్యాన్ని ఈ విషయంగా పరిశీలించవల్సి ఉంటుంది. హాల్స్బరీస్ లాస్ ఆఫ్ ఇంగ్లాండ్ (వాల్యూమ్ 13, 4 వ ఎడిషన్, పేరా 1269, పేజీ 602) లో వైవాహిక సంబంధాలలో క్రూరత్వం గురించి ఇచ్చిన నిర్వచనం మీద ఈ కోర్టు ఆధారపడడం జరిగినది , దానిని ఈ క్రింద తప్పనిసరిగా పొందపర్చవల్సివుంది.

*"అన్ని క్రూరత్వపు కేసులలో సాధారణ సూత్రం ఏమిటంటే, వైవాహిక సంబంధాన్ని మొత్తాన్ని పరిశీలించాలి మరియు హింసాత్మక చర్యలే కాక బాధ కల్గించే మందలింపులు, ఫిర్యాదులు, ఆరోపణలు లేదా ఎగతాళి చేయడం క్రూరత్వం అయినప్పుడు ఈ సూత్రానికి మరీ ప్రత్యేకమైన విలువ ఉంటుంది. క్రూరత్వం గురించి ఏమి చెప్పని కేసులలో , అన్ని సందర్భాలలో క్రూరత్వం అని చెప్పడానికి తగిన లేక తగని గుణాలు కలిగిన లేక లేకపోయిన కొన్ని విధాలైన చర్యలు లేక ప్రవర్తనలను సృష్టించే ఉద్దేశంతో , న్యాయపరమైన తీర్పులను పరిశీలించడమనేది అవాంఛనీయమైనది. ఎందుకంటే క్రూరత్వాన్ని గురించిన ఫిర్యాదును అంచనా వేసేటప్పుడు ప్రవర్తన యొక్క స్వభావం కంటే దాని యొక్క ప్రభావానికి ఎక్కువ ప్రాముఖ్యత ఉంటుంది. ఒక జీవిత భాగస్వామి మరొకరి పట్ల క్రూరత్వానికి పాల్పడినారా లేదా అనేది ముఖ్యమైన ఒక వాస్తవం కనుక, గతంలో నిర్ణయించిన న్యాయపరమైన తీర్పులకు విలువ ఏదైనా ఉన్నా అది చాలా తక్కువగా ఉంటుంది. కక్షిదారుల యొక్క శారీరక మరియు మానసిక పరిస్థితి, వారి యొక్క సామాజిక స్థితులను కోర్టు గమనికలో ఉంచుకోవాలి మరియు ఒక జీవిత భాగస్వామి యొక్క వ్యక్తిత్వము మరియు ప్రవర్తన మరొకరి మనస్సుపై చూపించే ప్రభావాన్ని గమనించుకుంటూ, వారి మధ్య జరిగిన అన్ని సంఘటనలు మరియు తగాదాలను వీటన్నింటి దృక్పధంలో పరిశీలించవలెను ; ఫిర్యాదుదారుని యొక్క భరాయింపు సామర్థ్యం మరియు ఆ సామర్థ్యం ఇతర జీవిత భాగస్వామికి ఎంతమేర తెలుసు అనే వాని దృష్ట్యా, ఆరోపించిన ప్రవర్తనను పరిశీలించాలి. క్రూరత్వానికి దుర్మార్గపు ఉద్దేశం అవసరం లేదు, కానీ అది (దుర్మార్గ ఉద్దేశం ) ఉన్న చోట అది ఒక ప్రముఖమైన అంశం అవుతుంది."*

కేవలం భార్య క్రిమినల్ కేసులను దాఖలు చేయడమే క్రూరత్వంగా పరిగణించడానికి వీలులేదు ఎందుకంటే ఆ కేసులు దాఖలు చేయడానికి దారి తీసిన పరిస్థితులను కూడా చూడవల్సివుంది అన్న ఢిల్లీ హైకోర్టు తీసుకున్న అభిప్రాయాన్ని ఈ కేసులో పూర్తిగా విస్మరించలేము, వాస్తవానికి న్యాయ ప్రాతిపదికన ఇది సరైనది కావచ్చు కానీ మన ముందు ఉన్న కేసులో అన్ని వాస్తవాలను మనం నిశితంగా పరిశీలించవల్సివుంది. ఇప్పుడు ఉన్న పరిస్తితులను మనం పరిశీలించినప్పుడు ఈ వివాహాన్ని కొనసాగించడం అంటే వీరు ఒకరిపై ఒకరు చూపుతున్న క్రూరత్వాన్ని కొనసాగించినట్లే అవుతుంది. హిందూ వివాహ చట్టములో వివాహన్ని విచ్ఛిన్నం చేయడానికి కోలుకోలేని విధముగా అది విచ్ఛిన్నం అయినది అన్నది ఒక ప్రాతిపదిక కాకపోవచ్చు , కానీ క్రూరత్వం మాత్రం ఒక ప్రాతిపదికే. ఫిర్యాదుదారుని , ఇతర కక్షిదారు , వారి వివాహం అయిన తరువాత క్రూరత్వంగా చూసినారు, అన్న ప్రాతిపదికన వారి వివాహాన్ని విడాకుల డిక్రీతో విఘటితం కావించవచ్చు.

(హిందూ వివాహ చట్టము 1955లోని సెక్షన్ 13 (1) (ఐఏ) ). మా పరిశీలనాత్మక అభిప్రాయం ప్రకారం కాలము గడిచే కొద్ది చేదుగాను , కఠినముగాను తయారైన దాంపత్య బంధం , ఇద్దరి (దంపతులకు) యెడల క్రూరత్వం కాక మరేమియు కాదు. ఈ విధమైన నామకః మిగిలివున్న విచ్ఛిన్నమైన వివాహాన్ని నిలిపి ఉంచడం అనేది ఇద్దరు కక్షిదారులకు అన్యాయం చేయడమే అవుతుంది. కోలుకోలేనంతగా విచ్ఛిన్నమైన వివాహం విషయంలో అలాంటి బాంధవ్యంలో ఒకరి యెడల ఒకరు క్రూరముగా ప్రవర్తించడమే అవుతుంది కనుక అది ఇద్దరి యెడల క్రూరత్వం ఉన్నట్లుగా భావించవచ్చు. అందువల్ల ఇది చట్టములోని 13 (1) (ఐఏ) సెక్షన్ కింద వివాహాన్ని విఘటన చేయడానికి ఇది ప్రాతిపదిక అవుతుంది.

**17.** క్రూరత్వము అనేది చట్టములో నిర్వచింపబడలేదు. అయిన ఇది వివాహం రద్దు కావడానికి ఒక ప్రాతిపదిక అయిన సందర్భంలో దీనిని వైవాహిక సంబంధాలకు సంబంధించిన మానవ ప్రవర్తన మరియు నడవడికగా చూడవల్సివున్నది. పైన చెప్పిన **సమర్ ఘోష్** కేసులో క్రూరత్వం గురించి ఈ కోర్టు అది శారీరకము మరియు మానసికమై ఉండవచ్చునని చెప్పడం జరిగినది.

*"46. . . ఇది (క్రూరత్వం) శారీరకమైనప్పుడు, ఇది వాస్తవము మరియు స్థాయిల ప్రశ్న అవుతుంది. ఇది మానసికమైనప్పుడు , క్రూర ప్రవర్తన యొక్క స్వభావము మరియు ఆ ప్రవర్తన జీవిత భాగస్వామి యొక్క మానసిక స్థితి పై చూపే ప్రభావం గురించిన విచారణ చేయవల్సివుంటుంది. ఈ (జీవిత భాగస్వామి) ప్రవర్తన యొక్క స్వభావము మరియు ఇది ఫిర్యాదు చేసిన జీవిత భాగస్వామిపై చూపే ప్రభావాన్ని పరిగణలోకి తీసుకుని అది ఆ వ్యక్తి (క్రూరంగా ప్రవర్తించిన జీవిత భాగస్వామి) తో జీవించడము తన (ఫిర్యాదు చేసిన భాగస్వామి) కు హానికరము మరియు వేదనాభరితము అవుతుందన్న సహేతుక భయశంక ఉండడం గురించి అంచనా వేయవాల్సి ఉంటుంది.*

**క్రూరత్వం ఉద్దేశ్యరహితం కూడా కావచ్చు:**

*. . . మానవ వ్యవహారములలో సామాన్యంగా ఫిర్యాదు చేయబడిన చర్య క్రూరత్వంగా భావించబడినట్లైతే ఉద్దేశ్యం లేకపోవడమనేది ఏమి తేడాను కలుగజేయదు. క్రూరత్వమనే విషయంలో ఉద్దేశం అనేది ముఖ్యమైన అంశం కాదు. బాధ కలుగచేయడమనేది కావాలని లేక ఉద్దేశపూర్వకంగా జరగలేదు అన్న ప్రాతిపదికన కక్షిదారునికి ఉపశమనను నిరాకరించుటకు వీలులేదు."*

అంతిమంగా ఈ న్యాయస్థానం మానసిక క్రూరత్వం గురించి కొన్ని ఉదాహరణలను ఇవ్వడం జరిగినది వాటిలో కొన్ని ఈ క్రింది విధంగా ఉన్నాయి:

(i) కక్షిదారుల యొక్క పూర్తి వైవాహిక జీవితాన్ని పరిశీలించినప్పుడు, వారు ఒకరితో ఒకరు కలిసి జీవించలేనంతగా తీవ్రమైన మానసిక వేదన, దుఖము మరియు బాధ అనేది మానసిక క్రూరత్వం యొక్క విస్తృత పారామితుల పరిధిలోకి వస్తుంది.

(xii) శారీరకంగా ఏ విధమైన అసమర్ధత మరియు సరైన కారణం లేకుండా చాలా కాలం పాటు ఏక పక్ష నిర్ణయంతో సంభోగం నిరాకరించడం, మానసిక క్రూరత్వం అవుతుంది.

(xiii) వివాహమైన తరువాత భర్త లేదా భార్య ఏకపక్షముగా సంతానం వద్దని నిర్ణయించుకుంటే అది క్రూరత్వానికి సమానం అవుతుంది.

**(xiv) చాలా కాలంపాటు నిరంతరాయంగా విడిగా ఉన్నప్పుడు వివాహబంధం సరి చేయలేనట్లు అయినదని సముచిత నిర్ణయానికి రావచ్చు. ఆ వివాహం చట్టబద్ధమైన బంధాన్ని కలిగి ఉన్నా కేవలం కల్పన మాత్రమే అవుతుంది. ఆ బంధాన్ని తెంచడానికి అంగీకరించకపోవడము వలన వివాహ పవిత్రతను కాపాడలేము, అదే కాక అది కక్షిదారుల యొక్క భావాలు మరియు భావోద్వేగాల గురించి ఖాతరు చేయనట్లవుతుంది. ఆ పరిస్థితులు మానసిక క్రూరత్వానికి దారితీస్తాయి.**

(ప్రాధాన్యత ఇవ్వబడింది)

**18.** ఇప్పటికి 25 సంవత్సరాల నుండి విడివిడిగా జీవిస్తున్న మరియు కేవలం నాలుగు సంవత్సరాలు మాత్రమే కలసి జీవించిన వివాహిత జంట మన ముందు ఉన్నారు. వీరికి వివాహము ద్వారా ఏ సంతానము లేదు వీరి వైవాహిక బంధము సరిచేయలేనంతగా పూర్తిగా విచ్ఛిన్నమైనది. ఈ వివాహ బంధము సంపూర్ణముగాను మరియు సరి చేయలేనంతగాను విచ్ఛిన్నమైనది. ఈ బాంధవ్యం కొనసాగింపు, వీరిద్దరి యెడల క్రూరత్వమే అవుతుంది కనుక దీనిని ముగించక తప్పదు. సుధీర్ఘముగా విడిగా ఉండడము మరియు దాంపత్య జీవితము లేకపోవడము అర్ధవంతమైన బంధాలన్నీ పూర్తిగా విచ్ఛిన్నమవ్వడం ఇద్దరిమధ్య (కటువైన) వాతావరణం ఉండడం (ఇవన్నీ) 1955 చట్టములోని సెక్షన్ 13 (1) (ఐఎ) కింద క్రూరత్వముగా గమనించాలి . అందువలన వివాహ బంధము పూర్తిగా సరిచేయలేనంతగా విచ్ఛిన్నమైన, చాలా కాలం విడిగా జీవిస్తున్న

మరియు (గత 25 సంవత్సరాలుగా) దాంపత్య జీవితమే లేనట్టి కక్షి దారుల మధ్య చాలా వ్యాజ్యలు ఉన్నట్టి, ప్రస్తుతము మన ముందున్న కేసులో 'వివాహం' అనేది కేవలం ఒకరిపై ఒకరు క్రూరత్వాని చూపుకోవడానికి మాత్రమే ఉన్నట్లుగా భావిస్తున్నాము. ఈ వివాహం ద్వారా ఏ సంతానము లేకపోవడం వల్ల దీని విఘటన ఈ కక్షిదారులపైన మాత్రమే ప్రభావం చూపుతుందన్న విషయమై మేము అవగాహన కలిగియున్నాము.

**19.** ఈ పరిస్థితుల్లో హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వును త్రోసిపుచ్చడమైనది, మా ఉత్తర్వులో చెప్పిన వివిధ కారణాల ఆధారంగా విచారణ కోర్టు ఇచ్చిన ఉత్తర్వును ఆమోదించడమైనది మరియు అప్పీలుదారు/భర్తకు విడాకుల డిక్రీని మంజూరు చేయడమైనది. వీరి వివాహం రద్దు చేయడమైనది.

**20.** అప్పీలుదారు/భర్త లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఉద్యోగి అన్న విషయాన్ని పరిగణనలోకి తీసుకుని మరియు అతని ప్రస్తుత జీతం నెలకు రూ.1,00,000/- (ఒక లక్ష రూపాయలు)ల కంటే ఎక్కువ అని మాకు అందిన సమాచారం మేరకు అతడు ప్రతివాది/భార్యకు శాశ్వత భరణం కోసం Rs.30,00,000/- (ముప్పై లక్షల రూపాయలు) మొత్తాన్ని ఇవ్వడం సబబు అని మేము భావిస్తున్నాము. ఈ మొత్తం రూ. 30 ,00,000/-( ముప్పై లక్షల రూపాయలు)ను, ఈ రోజు నుండి నాలుగు వారాల వ్యవధిలో ప్రతివాది పేరిట ఈ కోర్టు రిజిస్ట్రీలో జమ చేయబడవలెను. ఆ విధముగా జమచేసిన తేది నుండి మాత్రమే ఈ విడాకుల డిక్రీ అమలులోనికి వస్తుంది. ఆ విధముగా జమ చేసిన తరువాత ప్రతివాది/భార్య యొక్క వివరాల ధృవీకరణను పరిశీలించి, ఈ కోర్టు నుండి మరేవిధమైన సూచనలు అవసరం లేకుండా, రిజిస్ట్రీ ఆ మొత్తాన్ని ప్రతివాది/భార్యకు అందించవలయును.

పైన పేర్కొన్న ఆదేశాలతో, అప్పీలు అనుమతించడమైనది.

**న్యాయమూర్తి.**

**[సుధాన్షు దులియా]**

**న్యాయమూర్తి.**

**[జె. బి. పార్దివాలా]**

**న్యూ ఢిల్లీ.**

**ఏప్రిల్ 26,2023.**